ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 331 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

గురువారం 03 జూలై 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

సింగయ్య భార్యను బెదిరించి రాజకీయం చేయాలని చూస్తారా?:సీఎం చంద్రబాబు

కుప్పం, జూలై 3, (రిపబ్లిక్ న్యూస్): తప్పుడు ప్రచారాలు తాత్కాలికం.. చేసిన పనులు శాశ్వతమని సీఎం చంద్రబాబు అన్నారు. కుప్పంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తప్పుడు ప్రచారాలతో ఎప్పుడూ రాజకీయాలు చేయలేదు. కారు కింద పడిన వ్యక్తిని కుక్కపిల్ల మాదిరిగా పక్కన పడేసి వెళ్తారా? కంపచెట్లలో పడేసి వెళ్లారంటే మానవత్వం ఉందా? అని ప్రశ్నిస్తున్నా. కనీస బాధ్యత, సామాజిక స్పృహ లేకుండా ప్రవర్తిస్తారా? సింగయ్య భార్యను పిలిపించి బెదిరించి రాజకీయం చేయాలని చూస్తారా? ఏమీ చేయలేని వాళ్లే శవ రాజకీయాలు చేస్తుంటారు" అని సీఎం మండిపడ్డారు.

బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. వందేళ్ల నుంచి గోదావరిలో ఏటా సగటున 2వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందని సీఎం అన్నారు. "వృథాగా సముద్రంలోకి పోయే వాటిలో 200 టీఎంసీలు వాడుకుంటే తెలుగు ప్రజలు బాగుపడతారు. నీటి సమస్య పరిష్కారమవుతుంది. ఇదే విషయాన్ని పదే పదే చెబుతున్నా... ఎవరికీ నష్టం లేదు. తెలంగాణలో గోదావరిపై నిర్మించిన ప్రాజెక్టులను ఎప్పుడూ నేను వ్యతిరేకించలేదు. వ్యతిరేకించను కూడా.రాయలసీమలో ఒకేసారి రూ.3,950 కోట్లు హంద్రీనీవాకు డబ్బులిచ్చాం. మైక్రో ఇరిగేషన్‌కు 90శాతం సబ్సిడీ ఇస్తున్నాం. పంటలకు ప్రాధాన్యత ఇస్తూ గిట్టుబాటు వచ్చేలా చేస్తున్నాం. రైతుకు ఎక్కువ ఆదాయం రావాలని వాణిజ్య పంటలకు వెళ్లాం. అయితే, వాణిజ్య పంటల్లో ఒక్కోసారి తక్కువ రేట్లు కూడా వస్తాయి. అనేక ఇబ్బందులను అధిగమించి ముందుకెళ్తున్నాం. రైతులను అన్ని విధాలా ఆదుకునే ప్రభుత్వం మాది. గత ప్రభుత్వం ఒక్క బిడ్డకే అమ్మఒడి ఇచ్చింది. ఎంత మంది పిల్లలు ఉన్నా మేము తల్లికి వందనం ఇస్తున్నాం" అని సీఎం తెలిపారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లు

లేకుండా స్థానిక ఎన్నికలు వద్దు:ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జూలై 3, (రిపబ్లిక్ న్యూస్):బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జులై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామని భారాస ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామన్న సీఎం ఇంకా స్పందించలేదన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వీల్లేదని పేర్కొన్నారు.

భాజపాపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఖర్గేకు లేఖ రాస్తున్నట్లు తెలిపారు. "జులై 8 లోపు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి. కాంగ్రెస్ లోని బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. బీసీ రిజర్వేషన్ల కోసం భారాస సహకరిస్తోంది. గోదావరి-బనకచర్ల విషయంలో ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తోంది" అని కవిత అన్నారు.

సిగాచీ పరిశ్రమలో నిపుణుల కమిటీ అధ్యయనం

సంగారెడ్డి, జూలై 3, (రిపబ్లిక్ న్యూస్): పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో 38 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ బృందం గురువారం పరిశ్రమను పరిశీలించింది. అగ్నిప్రమాదం జరిగిన తీరుపై అధ్యయనం చేస్తోంది. కార్మికుల భద్రతకు యాజమాన్యం నిబంధనలు పాటించిందా? లేదా? అన్న అంశంపై విచారణ చేపట్టింది. నెల రోజుల్లో ప్రమాదంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

ఈ కమిటీకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ఎమెరిటస్ శాస్త్రవేత్త డాక్టర్ బి. వెంకటేశ్వరరావు చైర్మన్ గా.. ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ టి.ప్రతాప్‌కుమార్, చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ సూర్యనారాయణ, పుణెలోని నేషనల్ కెమికల్ ల్యాబ్ భద్రతాధికారి డాక్టర్ సంతోష్ గుగే సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయడంతోపాటు భవిష్యత్తులో కెమికల్, ఫార్మా పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన సూచనలు, విధివిధానాలతో నివేదిక రూపొందించనుంది.

భారత్ పై 'ఆర్థిక బంకర్ బస్టర్'

:అమెరికాకు ఆందోళనలు తెలియజేశామన్న జైశంకర్

జూలై 3, (రిపబ్లిక్ న్యూస్): రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి చేసుకొనే దిగుమతులపై 500 శాతం పన్నుతో 'ఆర్థిక బంకర్ బస్టర్' జారవిడుస్తామంటూ అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. క్వాడ్ సమావేశంలో పాల్గొనడానికి నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వాషింగ్టన్‌కు వెళ్లిన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడారు. తమ ఆందోళనలను ఆ సెనెటర్ తో ఇప్పటికే పంచుకొన్నామని ఆయన పేర్కొన్నారు. ఆ బిల్లు వాస్తవరూపం దాలిస్తే ఎదురయ్యే ఇబ్బందులపై తమకు అవగాహన ఉందని చెప్పారు.

జైశంకర్ వాషింగ్టన్‌లో జరిగిన ట్రైస్కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అమెరికా కాంగ్రెస్లో జరుగుతున్న పరిణామాలు భారత్ ప్రయోజనాలపై ప్రభావం చూపనుండటంతో వాటిని జాగ్రత్తగా గమనిస్తున్నామన్నారు. భారత్ దౌత్య కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు ఆ బిల్లుకు స్పాన్సర్లా వ్యవహరిస్తున్న లిండ్సే గ్రాహంతో టచ్లో ఉన్నట్లు చెప్పారు. "మా ఆందోళనలు, ఇంధన భద్రత ప్రయోజనాలను ఆయనకు తెలియజేసినట్లే భావిస్తున్నా. ఇక అవసరమైతే ఆ సమస్య వచ్చినప్పుడు ఎదుర్కోవాలి" అని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం పరిస్థితిని మరింత జఠిలం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి అమెరికా చేసుకొనే దిగుమతులపై 500 శాతం పన్ను విధించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ఈ బిల్లును ప్రస్తావించే సమయంలో సెనెటర్ లిండ్సే గ్రాహం భారత్, చైనా పేర్లను ముఖ్యంగా ప్రస్తావించడం గమనార్హం. ఉక్రెయిన్తో చర్చలకు రష్యాను ఒప్పించేందుకు ఓ ఆయుధం వలే ఈ బిల్లును వాడాలని ట్రంప్ కార్యవర్గం భావిస్తోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే.. రష్యా నుంచి పెద్దమొత్తంలో ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇది మన ఔషధాలు, వస్త్రాలు వంటి ఎగుమతులపై ప్రభావం చూపుతుంది. ఇక, ఉక్రెయిన్కు మద్దతు ఇచ్చే దేశాల కోసం లిండ్సే మరో ఒప్పందాన్ని ప్రతిపాదించనున్నట్లు తెలుస్తోంది. మరో 48 గంటల్లో భారత్-అమెరికా మధ్య మినీ ట్రేడ్ డీల్ ఓ కొలిక్కి వస్తుందన్న వేళ జైశంకర్ వ్యాఖ్యలు కీలకంగా మారాయి.

ఆరోగ్య ఆంధ్రకు తొలి అడుగు..

కుప్పం ఆసుపత్రిలో డీఐఎన్సీ ప్రారంభించిన చంద్రబాబు

కుప్పం, జూలై 3, (రిపబ్లిక్ న్యూస్): ఆరోగ్య ఆంధ్ర కల సాకారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం నుంచే తొలి అడుగు వేశారు. రాష్ట్రప్రభుత్వం, టాటా సంస్థ సహకారంతో కుప్పం ప్రాంతీయ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిజిటల్ నెర్వ్ కేంద్రాన్ని (డీఐఎన్సీ) సీఎం ప్రారంభించారు.

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఏరియా ఆసుపత్రి-13 పీహెచ్సీలు, 92 విలేజ్ హెల్త్ సెంటర్లు అనుసంధానం చేశారు. వ్యక్తిగత వైద్య రికార్డుల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేలా ఈ కేంద్రం సేవలందించనుంది. దీని ద్వారా వర్చువల్ విధానంలో రోగికి వైద్య నిపుణుల్ని అందుబాటులోకి తీసుకొచ్చి చికిత్స అందించే వెసులుబాటు కలుగుతుంది. ప్రజారోగ్యానికి సంబంధించి అన్ని వివరాలు ఒక్క చోట చేర్చేలా డిజి నెర్వ్ ఏర్పాటు చేశారు.

సినిమాల పైరసీ కేసు.. నిందితుడు కిరణ్ ఇండస్ట్రీకి రూ.వందల కోట్ల నష్టం

హైదరాబాద్, జూలై 3, (రిపబ్లిక్ న్యూస్): విడుదలైన సినిమాలు పైరసీ చేసిన కేసులో కిరణ్ అనే వ్యక్తి అరెస్టు కాగా.. దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు కిరణ్ తో సినీఇండస్ట్రీకి రూ. వందల కోట్ల నష్టం వాటిల్లినట్లు తేలింది. పైరసీకి పాల్పడుతున్న అతడిని రెండ్రోజుల క్రితం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏసీ టెక్నీషియన్గా పనిచేస్తోన్న కిరణ్.. 2019 నుంచి ఇప్పటి వరకు 65 సినిమాలను పైరసీ చేశాడు. వాటిని పలు సైట్లకు విక్రయించాడు. ఒక్కో సినిమాకు రూ. 40 వేల నుంచి రూ.80 వేల వరకు చెల్లింపులు జరిగాయి. కిరణ్కు క్రిప్టో కరెన్సీ రూపంలో కమీషన్ వచ్చేది. ఇటీవల చసింగిల్ సినిమానూ పైరసీ చేశాడు. దీంతో ఫిలించాంబర్ లోని యాంటీ పైరసీ సెల్ ప్రతినిధి యర్ర మణీంద్ర బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



రష్యాకు మద్దతుగా మరో 30 వేల మంది కిమ్ సేనలు..!

జూలై 3, (రిపబ్లిక్ న్యూస్): ఉక్రెయిన్ పై జరుగుతున్న యుద్ధంలో రష్యాకు మద్దతుగా మరో 30,000 మంది వరకు సైనికులను పంపేందుకు ఉత్తర కొరియా సిద్ధమైంది. కీవ్ ఇంటెలిజెన్స్ వర్గాలను ఉటంకిస్తూ ఈ విషయాన్ని అమెరికా ఛానెల్ సీఎన్ఎన్ వెల్లడించింది. రానున్న కొన్ని నెలల్లో ఈ సైనిక బృందాలు రష్యాలోని యుద్ధరంగానికి చేరుకోనున్నాయి.

గతేడాది క్రస్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ సేనలు చొచ్చుకురావడంతో.. నవంబర్ లో దాదాపు 11,000 మంది సైనికులను కిమ్ ప్రభుత్వం పంపించింది. అందులో సుమారు 4,000 మంది వరకు యుద్ధ భూమిలో చనిపోవడమో.. గాయపడటమో జరిగిందని సీఎన్ఎన్ వెల్లడించింది. ఉత్తర కొరియా నుంచి సైనికులను రవాణా చేసేందుకు ఇప్పటికే రష్యా ట్రాన్స్పోర్ట్ విమానాలు సిద్ధమవుతున్నాయని ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. వీరిని సైబిరియా మీదుగా ఉక్రెయిన్లోకి చేర్చనున్నాయి. గతేడాది సైనికులను తరలించేందుకు వాడిన నౌక ఒకటి తిరిగి రష్యా ఓడరేవులో లంగరు వేయడం, ఉత్తరకొరియా సునాన్ ఎయిర్పోర్టులో మాస్కో కార్గో విమానం కనిపించడం అనుమానాలను బలపరుస్తోంది. ఇటీవల ఉక్రెయిన్ రక్షణమంత్రి రుస్టెమ్ ఉమెరోవ్ మాట్లాడుతూ కిమ్ జోంగ్ ఉన్ తన అత్యున్నత దళాలను రష్యాకు సహాయంగా పంపించి స్వదేశాన్ని సమస్యల్లో పడేస్తున్నారన్నారు. అంతేకాదు.. ప్యాంగ్యాంగ్ సేనలను చూస్తే.. రష్యా సొంత సైనిక సమీకరణలో సమస్యలు ఉన్న విషయం తెలుస్తోందని చెప్పారు. ఉత్తరకొరియా-రష్యాల మధ్య సైనిక సహకార ఒప్పందం జరిగి ఏడాది పూర్తయింది. ఈసందర్భంగా ప్యాంగ్యాంగ్లోని గ్రాండ్ థియేటర్ లో ఓ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉత్తర కొరియా సైనికులు రష్యా సరిహద్దులో చేసిన పోరాటాలను గుర్తుచేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఉ.కొరియా నియంత కిమ్ సహా రష్యా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏసీబీ విచారణకు హాజరైన సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్

హైదరాబాద్, జూలై 3, (రిపబ్లిక్ న్యూస్): ఫార్ములా-ఈ కార్ రేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్కుమార్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఆయన ఏ2గా ఉన్నారు. కేటీఆర్, బీఎల్ఎన్ రెడ్డి వాంగ్మూలం ఆధారంగా అర్వింద్ను విచారించే అవకాశం ఉంది. కేసులో ఇప్పటికే ఏ1గా ఉన్న కేటీఆర్ను రెండు సార్లు, ఏ3గా ఉన్న బీఎల్ఎన్ రెడ్డిని రెండు సార్లు విచారించింది. హైదరాబాద్లో 2023 లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేస్ కోసం విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా సొమ్ము చెల్లించడం వల్ల ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఏసీబీ కేసు నమోదు చేసింది. రేస్ నుంచి ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎస్ఈవో) సంస్థ తప్పుకొన్న అనంతరమూ నిధులు ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందనే కోణంలో ఆరా తీస్తోంది. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నా ఆర్థికశాఖ నుంచి అనుమతి తీసుకోకపోవడం.. మంత్రివర్గం ఆమోదం పొందకపోవడం.. తదుపరి మూడేళ్లపాటు రేస్ ల నిర్వహణకు రూ.600 కోట్ల మేర చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకోవడాన్ని అంతర్గత విచారణలో ప్రభుత్వం తప్పుపట్టింది. ఆర్థికశాఖ నుంచి అనుమతి తీసుకోకుండానే రూ.54.88 కోట్ల మేర చెల్లించడాన్ని తీవ్ర నేరంగా పరిగణించింది. దీనిపై ప్రస్తుతం ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. అయితే పురపాలక శాఖ మంత్రి హోదాలో కేటీఆర్ ఆదేశించడంతోనే తాము నిధులు విడుదల చేసినట్లు అప్పట్లో హెచ్ఎండీఏ కమిషనర్గా కొనసాగిన అర్వింద్కుమార్ ఇదివరకే ప్రభుత్వానికి లిఖితపూర్వక వాంగ్మూలం ఇవ్వడంతోపాటు ఏసీబీ విచారణలోనూ అంగీకరించారు.

తల, మొండెం వేరు చేసి.. ముదిగుబ్బలో వ్యక్తి దారుణహత్య

ముదిగుబ్బ, జూలై 3, (రిపబ్లిక్ న్యూస్): శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బలో దారుణం చోటుచేసుకుంది. కదిరి రోడ్డులో ఉన్న బైపాస్ దగ్గర విశ్వనాథ్ (40) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లచెరువు మండలంలోని టి. ఎర్రగుంటపల్లికి చెందిన విశ్వనాథ్.. ఓబుల దేవరచెరువు మండలంలోని గాజుకుంటపల్లిలో వివాహం చేసుకున్నాడు. బైపాస్ దగ్గర అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు అతడిని దారుణంగా హతమార్చారు. తల, మొండెం వేరు చేశారు. ఘటనాస్థలాన్ని ధర్మవరం డీఎస్పీ హేమంత్కుమార్, ముదిగుబ్బ టౌన్ సీఐ శివరాముడు పరిశీలించారు. ఈ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



5న జాతీయ లోక్ అదాలత్:న్యాయసేవాధికార సంస్థ

అమరావతి, జూలై 3, (రిపబ్లిక్ న్యూస్): ఈ నెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి హిమబిందు తెలిపారు. ఇందులో ఆస్తి, సివిల్ తగాదాలు, చెక్బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,15,071 కేసులు గుర్తించినట్లు చెప్పారు. మధ్యవర్తిత్వంలో కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జులై 1 నుంచి 90 రోజుల పాటు దేశవ్యాప్తంగా ప్రత్యేక క్యాంపెయిన్ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇందు కోసం రాష్ట్రంలో 893 మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వివరించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1910:** తెలంగాణలో విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన రావిచెట్టు రంగారావు మరణం. (జ.1877)
- **1918:** తెలుగు సినిమా నటుడు ఎస్వీ రంగారావు జననం (మ.1974).
- **1914:** నిజాం నిరంకుశ పాలన వ్యతిరేక ఉద్యమకారుడు విశ్వనాథశర్మ జననం.
- **1924:** తత్వవేత్త, చిత్రకారుడు, రచయిత, కవి సూర్యదేవర సంజీవదేవ్ జననం (మ.1999)
- **1927:** తెలుగు రచయిత బలివాడ కాంతారావు జననం (మ. 2000).
- **1928:** కర్ణాటక సంగీత విద్వాంసురాలు, దక్షిణ భారత చలనచిత్రరంగంలో నేపథ్యగాయని ఎం. ఎల్. వసంతకుమారి జననం. (మ.1990) (చిత్రంలో)
- **1980:** భారత క్రికెట్ జట్టు క్రీడాకారుడు హర్భజన్ సింగ్ జననం.

రావిచెట్టు రంగారావు

ఎస్వీ రంగారావు

విశ్వనాథశర్మ

సూర్యదేవర సంజీవదేవ్

కాంతారావు

ఎం. ఎల్. వసంతకుమారి

హర్భజన్ సింగ్

పిచ్చి రాతలు, నెగెటివ్ కామెంట్స్ కంచుకోటను కదిలించలేవు:దర్శకుడు జ్యోతికృష్ణ

చరిత్రను గుర్తుచేసే సినిమా 'హరి హర వీరమల్లు' అని నిర్మాత ఏఎం రత్నం అన్నారు. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'హరిహర వీరమల్లు'. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో నిర్మాత మాట్లాడారు. "పవన్ అభిమానులు ఎవరూ ఊహించని స్థాయిలో 'హరిహర వీరమల్లు' ట్రైలర్ ఉంది. ఇది పవన్ మొదటి పాన్ ఇండియా సినిమా. ఆయనతో ఇలాంటి పాన్ ఇండియా మూవీ తీయాలని 'ఖుషి' సమయంలోనే అనుకున్నాను. ఐదు సంవత్సరాల తర్వాత ఈ చిత్రం మీ ముందుకు వస్తుంది. పవన్ కూడా ఈ ట్రైలర్ను ఏడుసార్లు చూశారు. ఈ చిత్రం ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. చరిత్రను గుర్తుచేస్తుంది. 'ఛావా' చూసి ఎంతోమంది భావోద్వేగానికి గురయ్యారు. ఇది కూడా అలాంటి కమర్షియల్ సినిమానే. ఈ క్రెడిట్ మొత్తం దర్శకుడు జ్యోతికృష్ణకే దక్కుతుంది. దీనికోసం ఎంతో కష్టపడ్డాడు. ఇప్పటివరకూ పవన్ కల్యాణ్ని అందరూ పవర్స్టార్ అన్నారు. ఈ సినిమాతో రియల్స్టార్ అంటారు. సినిమాల్లోనే కాదు.. నిజజీవితంలోనూ ఆయన దాన్ని నిరూపించుకుంటున్నారు. అందరూ సినిమాల్లోనే హీరోగా ఉంటారు. పవన్ నిజజీవితంలోనూ రియల్ హీరోనే. ఈ చిత్రం ఆయన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తుంది " అని ఏఎం రత్నం అన్నారు. "తుపాను వచ్చేసింది. ఈ సినిమా ట్రైలర్ తర్వాత కొంతమంది గురించి మాట్లాడాలనుకుంటున్నాను. వాళ్లు ఎవరో కూడా నాకు తెలియదు. ఎలా ఉంటారో తెలియదు. ఈ సినిమా ప్రారంభం నుంచి వాళ్లు దీని గురించి నెగెటివ్ ప్రచారం చేస్తూనే ఉన్నారు. ఈ సినిమా రాదు.. ఆగిపోయింది అని కామెంట్ చేస్తూనే ఉన్నారు. వాళ్లందరికీ ఒక్కటే చెబుతున్నాను. ఈ చిత్రం ప్రారంభమై ఐదేళ్లు అయింది. కొవిడ్ సమయంలో కొన్ని రోజులు ఆగిపోయింది. అయినా మా వర్క్ ఆగలేదు. ఆ తర్వాత ఎన్నికలు వచ్చాయి. పవన్ మంచి ఫలితాలను సొంతం చేసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి అయ్యారు. అయినా వాళ్లు ప్రచారం మాత్రం ఆపలేదు. కానీ, మేము ఏం మాట్లాడలేదు. మా పని మేం చేసుకుంటూనే ఉన్నాం. వాళ్లు రాసే పిచ్చి రాతలు, నెగెటివ్ కామెంట్స్ కంచుకోటను కదిలించలేవు. అభిమానులను కూడా ఆపలేవు. అలాగే చాలామంది ఈ సినిమాకు బడ్జెట్ ఎక్కువైంది. వరుట్ అవుతుందా అన్నారు. వాళ్లందరికీ ఒక్కటే చెబుతున్నా. మన పవన్కల్యాణ్ ఇమేజ్కు ఎంత బడ్జెట్ అయినా తక్కువే అవుతుంది. ఏఎం రత్నం సినిమాలన్నీ పెద్ద బడ్జెట్ సినిమాలేష. "నెగెటివ్ ప్రచారం చేసే వాళ్లందరికీ మరొక విషయం కూడా చెప్పాలనుకుంటున్నాను. ఇండస్ట్రీలో భారీ వసూళ్లు సాధించిన మొదటి చిత్రం 'ఖుషి'. 2001లోనే రికార్డులు సృష్టించింది. దాని తర్వాత బాక్సాఫీసు వద్ద రూ.100 కోట్లు వసూళ్లు చేసిన తెలుగు చిత్రం 'గబ్బర్ సింగ్'. అదీ పవర్ స్టార్ అంటే ఈ సినిమాకు నేను ఒక్కడినే కష్టపడ్డాను అంటే అది తప్పు. దీనికి పునాది వేసిన క్రిష్కు ఈసందర్భంగా ధన్యవాదాలు చెబుతున్నాను. అలాగే త్రివిక్రమ్కు కూడా ప్రత్యేక కృతజ్ఞతలు. మా ఒడుదొడుకుల్లో మాతో ఉన్నారు. చివరివరకూ మాతో ప్రయాణించారు. మీ అందరికీ మంచి సినిమాను అందించడం కోసమే కష్టపడ్డాం. అందుకే ఆలస్యం అయింది. ఈసారి మాత్రం విడుదల తేదీ మారదు.. ఇండస్ట్రీ రికార్డులు మారతాయి" అని దర్శకుడు జ్యోతి కృష్ణ ధీమా వ్యక్తంచేశారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

ఓటీటీలోకి 'థగ్ లైఫ్'.. సైలెంట్గా వచ్చేసిన సినిమా

కమల్ హాసన్ మణిరత్నం కాంబోలో ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన చిత్రం -'థగ్ లైఫ్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని ఆశించిన స్థాయిలో అందుకోలేకపోయింది. ఇప్పుడీ చిత్రం సైలెంట్గా ఓటీటీలోకి వచ్చేసింది. నెట్ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీతో పాటు కన్నడలోనూ ఇది అందుబాటులోకి వచ్చింది. కమల్ సరసన త్రిష నటించిన ఈ సినిమాలో శింబు, అభిరామి కీలక పాత్రల్లో కనిపించారు. కథేంటంటే: రంగరాయ శక్తిరాజు (కమల్ హాసన్) ఓ ముఠాకి నాయకుడు. అనుకోకుండా జరిగిన కాల్పుల ఘటనలో అమర్ (శింబు) చిన్న వయసులోనే తన తండ్రిని కోల్పోతాడు. తన చెల్లి కూడా దూరమైపోతుంది. దాంతో అమర్ని చేరదీసి, తన కొడుకులా పెంచుతాడు శక్తిరాజు. దూరమైన చెల్లిని కూడా వెతికి తీసుకొస్తానని మాటిస్తాడు. తన తర్వాత ఆ ముఠాకు అమర్ను నాయకుడిగా చేస్తాడు. దీనిని ముఠాలోని ఇతర సభ్యులు మాణిక్యం (నాజర్), పత్రోస్ (జోజు జార్జ్), తదితరులు జీర్ణించుకోలేరు. ఇంతలోనే శక్తిరాజుపై హత్యాయత్నం చోటుచేసుకుంటుంది. అప్పట్నుంచి ముఠాలో అలజడి మొదలవుతుంది. ఇంతకీ శక్తిరాజుపై హత్యాయత్నం చేసింది ఎవరు? అప్పటివరకూ తండ్రీ కొడుకుల్లా మెలిగిన శక్తిరాజుకీ, అమర్కీ మధ్య వైరం ఎందుకు మొదలవుతుంది? ఈ కథలో ఇంద్రాణి (త్రిష), లక్ష్మి (అభిరామి) ఎవరు? ముఠాలో చివరికి ఎవరు మిగిలారన్నది కథ.

సోర్ట్స్

తుది జట్టు ఎంపికలో మాకెలాంటి సందేహం లేదు :గిల్కు యశస్వి మద్దతు

ఇంగ్లాండ్తో రెండో టెస్టుకు ఎంపిక చేసిన భారత తుది జట్టుపై మాజీల నుంచి విమర్శలు వచ్చాయి. సీనియర్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడం, స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ను కాదని వాషింగ్టన్ సుందరన్ను తీసుకోవడం, సాయి సుదర్శన్ను పక్కన పెట్టడం.. ఇందులో కీలక అంశాలు. టీమ్ ఇండియా మేనేజ్మెంట్ తీసుకుంటున్న నిర్ణయాలు అయోమయానికి గురిచేసేలా ఉన్నాయనేది వారి వాదన. అయితే, ఈ విషయంలో భారత కెప్టెన్ శుభ్మన్ గిల్కు యశస్వి జైస్వాల్ మద్దతుగా నిలిచాడు. తుది జట్టు ఎంపికలో తమకు ఎలాంటి కన్ఫ్యూజన్ లేదని స్పష్టంచేశాడు. కెప్టెన్గా ఉంటూ గిల్ అద్భుతమైన ఆటతీరును ప్రదర్శిస్తున్నాడని యశస్వి తెలిపాడు. "గిల్ తో కలిసి బ్యాటింగ్ చేయడం బాగుంది. ఇంగ్లాండ్ పై వరుసగా రెండో శతకం బాదాడు. జట్టు కోసం ఏం చేయాలి? ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే దానిపై స్పష్టతతో ఉంటాడు. అతడిలో కనిపిస్తోన్న ఆత్మవిశ్వాసమే దానికి ప్రత్యక్ష సాక్ష్యం. ఉత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు మేమెప్పుడూ ప్రయత్నిస్తాం. తుది జట్టు విషయంలో ఎలాంటి అయోమయానికి గురయ్యే పరిస్థితే లేదు. ఆ విషయంలో ఎలాంటి సందేహం లేదు. ఎడ్జ్బాస్టన్లోనూ నా బ్యాటింగ్ను ఆస్వాదించా. ఒక్కో స్పెల్, ఒక్కో సెషన్ ను బేరీజు వేసుకుంటూ ఆడేందుకు ప్రయత్నిస్తా. ఎక్కడైతే పరుగులు రాబట్టే అవకాశం ఉందని నాకు అనిపిస్తే ఆ ఛాన్స్ను అస్సలు వదులుకోను. కొత్త బంతితో ప్రత్యర్థి బౌలర్లు చాలా బాగా బౌలింగ్ చేశారు. ఆ సమయంలో ఎటాకింగ్ చేయడం చాలా కష్టం. ఎప్పుడైతే స్వింగ్ ఆగిందో అప్పుడు షాట్లు కొట్టేందుకు వెళ్లా" అని జైస్వాల్ వెల్లడించాడు.

చేజారినందుకు బాధగానే ఉంది.. కానీ

"మూడంకెల స్కోరు చేయలేకపోయినందుకు బాధగానే ఉంది. ఆటను ఆస్వాదించాలని కోరుకుంటా. అంతేకానీ, మైలురాళ్ల గురించి పెద్దగా పట్టించుకోను. పొరపాట్ల నుంచి నేర్చుకుంటూ ఆటను ఎంజాయ్ చేస్తా. ఇంగ్లాండ్ బౌలర్లు ఫుల్టాట్లు కొట్టేందుకు నన్ను ఎక్కువగా ఊరిస్తారు. వాటిని ఎలా ఆడాలనేది నాకంటూ ఓ ప్రణాళిక ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఆ సమయంలో ఏది మంచిదో దానిని అనుసరిస్తా. తొలి రోజు మేం మంచి స్కోరే చేయగలిగాం. రెండో రోజు కూడా ఇంకొన్ని పరుగులు చేయగలిగితే పట్టు సాధించేందుకు మాకే ఎక్కువ అవకాశం" అని జైస్వాల్ వెల్లడించాడు. రెండో టెస్టులో యశస్వి 87 పరుగులు చేశాడు. ఎడ్జ్బాస్టన్లో అత్యధిక పరుగులు చేసిన (87) ఓపెనర్గా మాత్రం యశస్వి నిలవడం గమనార్హం. అయితే, మరో పది పరుగులు కొట్టి ఉంటే.. అత్యంత వేగంగా 2000 పరుగుల మార్ను అందుకొన్న భారత బ్యాటర్గా నిలిచేవాడు. యశస్వి 39 ఇన్నింగ్స్ ల్లో 1990 పరుగులు చేశాడు. ఇక రెండో ఇన్నింగ్స్ 10 రన్స్ చేసినా చాలు.. రాహుల్ ద్రావిడ్ (40 ఇన్నింగ్స్), వీరేంద్ర సెహ్వాగ్ (40)తో కలిసి అగ్రస్థానంలో కొనసాగుతాడు.

అందం

ఏం ట్రై చేసినా తెల్ల జుట్టు సమస్య తగ్గడం లేదా? కొన్ని ఇంటి చిట్కాలతో నల్లగా మారుతుంది

హెన్నా, హెయిర్ డై, మార్కెట్లో దొరికే వివిధ ప్రొడక్ట్స్ వాడి తెల్ల జుట్టు కాస్తా నల్లగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కొన్ని సార్లు ఫలితం ఉండకపోవచ్చు. తెల్ల జుట్టును సహజంగానే నల్లగా మార్చుకోవడానికి కొన్ని ఇంటి నివారణలు అద్భుతంగా పనిచేస్తాయి. అలాంటి ఇంటి చిట్కాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

ప్రతి ఒక్కరి అందంలో జుట్టు కీలకపాత్ర పోషిస్తుంది. చాలా మంది.. ఒత్తైన, మెరిసే, పొడవైన కేశాలు ఉండాలని కోరుకుంటారు. అయితే, జుట్టు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. జన్యులోపాలు, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, కాలుష్యం కారణంగా తెల్లజుట్టు ఈ జనరేషన్లో పెద్ద సమస్యగా మారింది. తెల్ల జుట్టుతో నలుగురిలోకి వెళ్లాలంటే కొందరు ఇబ్బంది పడుతున్నారు. నిండా ముప్పై ఏళ్ల నిండక ముందే తలంతా తెల్ల వెంట్రుకలతో కనిపించే వాళ్లు చాలా మంది ఉన్నారు. కొందరు ఈ సమస్య గురించి అంతగా పట్టించుకోరు. మరికొందరు మాత్రం సీరియస్గా ఉంటారు. హెన్నా, హెయిర్ డై, మార్కెట్లో దొరికే వివిధ ప్రొడక్ట్స్ వాడి తెల్ల జుట్టు కాస్తా నల్లగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కొన్ని సార్లు ఫలితం ఉండకపోవచ్చు. తెల్ల జుట్టును సహజంగానే నల్లగా మార్చుకోవడానికి కొన్ని ఇంటి నివారణలు అద్భుతంగా పనిచేస్తాయి. అలాంటి ఇంటి చిట్కాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

ఉసిరి, శీకాయ వాడకం

ఉసిరి, శీకాయ రెండూ జుట్టుకు మేలు చేస్తాయి. ఉసిరిలో ఎన్నో పోషకాలు ఉన్నాయి. విటమిన్ సి, అవసరమైన కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉన్నాయి. ఈ పోషకాలన్నీ జుట్టుకు తగిన పోషణ అందిస్తాయి. జుట్టుకు ఆరోగ్యంగా ఉంచడంలో ఉసిరి పొడి కీలక పాత్ర పోషిస్తుంది. ఇక, శీకాయలో జుట్టు తెల్లబడకుండా నిరోధించే యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి. ఈ రెండింటిని కలిపి వాడితే తెల్లజుట్టు నల్లగా మారుతుంది. ఇందుకోసం, ఉసిరి పొడి, శీకాయ పొడిని కలిపి పేస్టులా తయారుచేసుకోండి. ఆ తర్వాత జుట్టు మొత్తం అప్లై చేయండి. ఓ ముప్పై నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తర్వాత షాంపూతో తలస్నానం చేయండి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

కొబ్బరి నూనె, వెల్లుల్లి వాడకం

జుట్టు సంరక్షణ కోసం కొబ్బరి నూనెను ఎప్పట్నుంచో వాడుతున్నారు. కొబ్బరి నూనెతో జుట్టుకు తగిన సంరక్షణ అందుతుంది. కొబ్బరి నూనె జుట్టును తేమగా ఉంచుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లతో పాటు అనేక రకాల పోషకాలు ఉంటాయి. ఇవి జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి. జుట్టు పెరుగుదలను కొబ్బరి నూనె ప్రోత్సాహిస్తుంది. కొబ్బరి నూనెతో మసాజ్ చేయడం వల్ల జుట్టు రాలడం తగ్గిపోతుంది. ఇక, వెల్లుల్లిలో సల్ఫర్ ఉంటుంది. ఇది జుట్టు తెల్లబడకుండా నిరోధిస్తుంది. ఇందుకోసం కొబ్బరి నూనె, వెల్లుల్లి కలిపి రెండింటిని పేస్టులా చేసుకోండి. ఆ తర్వాత జుట్టు మొత్తానికి అప్లై చేయండి. ఆ తర్వాత ముప్పై నిమిషాల పాటు అలాగే ఉంచి వాష్ చేసుకోండి.

భృంగరాజ్, బ్రాహ్మీ పొడర్

శతాబ్దాలుగా ఆయుర్వేదం అనేక వ్యాధుల్ని నయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆయుర్వేద చిట్కాలు ఇప్పటికీ సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. ఇక, బ్రాహ్మీ మొక్క, వేర్లు, పువ్వుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇక, బ్రాహ్మీ పొడర్ మార్కెట్లో దొరకుతుంది. ఇది జుట్టుకు తగిన పోషణ అందిస్తుంది. తలపై సహజ రక్షణ పొరను సృష్టిస్తుంది. దీంతో, పొల్యూషన్, దుమ్ము, ధూళి ఎఫెక్ట్ నుంచి కేశాలను రక్షిస్తుంది. అంతేకాకుండా తెల్ల జుట్టును సహజంగానే నల్లగా మారుస్తుంది. భృంగరాజ్లో జుట్టును బలోపేతం చేసే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ రెండింటి పొడిని కలిపి పేస్టులా తయారుచేసి జుట్టుకు అప్లై చేస్తే తెల్ల జుట్టు నల్లగా మారుతుంది.

ఇది కూడా ట్రై చేయండి

తెల్ల జుట్టును నల్లగా మార్చే హెయిర్ ప్యాక్ కోసం ముందుగా రెండు నుంచి మూడు స్పూన్ల బ్రాహ్మీ పొడర్ తీసుకోండి. ఈ పొడిని నీళ్లల్లో కలిపి చిక్కటి పేస్టులా చేసుకోండి. ఈ మిశ్రమంలో రెండు స్పూన్ల హెన్నా వేసి బాగా మిక్స్ చేసుకోండి. కాసేపు తర్వాత ఈ ప్యాక్ను జుట్టుకు బాగా అప్లై చేయండి. జుట్టు కుదుళ్ల వరకు అప్లై చేయండి. ఈ హెయిర్ మాస్క్ను ఒక గంట పాటు అలాగే ఉంచాలి. ఆ తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుంది. అయితే, ఈ హెయిర్ ప్యాక్ అప్లై చేసేటప్పుడు జుట్టు జిడ్డుగా ఉండకూడదు. పొడిగా ఉండేలా చూసుకోండి. ఇలా నెలకు మూడు నుంచి నాలుగు సార్లు చేస్తే తెల్ల జుట్టు సహజంగానే నల్లగా మారుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

ఇవి కూడా ముఖ్యం

- విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే ఆహారాన్ని తినండి.
- ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటివి చేయండి.
- జుట్టును క్రమం తప్పకుండా వాష్ చేసుకోండి. కండీషనర్ వాడండి.
- తేలికపాటి షాంపూని ఉపయోగించండి. రసాయనాలతో కూడిన డైల వాడకాన్ని తగ్గించండి.
- బయోటిన్ ఎక్కువగా ఉండే ఆహారాల్ని తీసుకోండి.

గమనిక

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.